# అమ్మో సంతకమా!

ప్రఫుల్లచంద్ర

**"నాయనా, ఈ పత్రమున సంతకము చేయుము" అని ఉదయముననే పల్లెనుంచి వచ్చిన బాబాయి ఆజ్ఞాపించగా గుటక పడక గుడ్లు మిటకరించుచూ ఉండిపోతిని.**

నా అవస్థను గమనించని బాబాయి "ఈ కుర్రవాడు మనవాడే. నిర్మాణ శాస్త్ర పట్టభద్రుడు. మంచివాడు. ఉద్యోగపూర్వ పరీక్షకు వెళ్ళుచున్నాడు. మంచి నడవడిక పత్రము కావలెనట. అదెంతపని! నేను తెచ్చెదనని వాగ్దానము చేసి యిటు వచ్చితిని" అని వివరించెను.

నేను సంతకము చేయు అధికారము గల ప్రభుత్వ కళాశాల ఉపన్యాసకుడను. లక్షా తొంబది సంతకములు చేసిన వాడను. కాని యిప్పుడు మాత్రం భయముగానున్నది.

"ఏమిరా అటుల ముడుచుకు పోయినావు!" బాబాయి అడగనే అడిగినాడు.

"ఆ కుర్రవాడు ఎటువంటివాడో, ఎటుల ఉండునో చూడకుండా.." అని మాటలు నమిలినాను.

"ఓరి, అంతేనా! అతని గురించి నాది హామీ! మంచి కుర్రవాడు. నిజముగా బుద్ధిమంతుడు. అతడే వచ్చెదననెను. కానీ నేనే తెచ్చెదనని మాట యిచ్చి యిటు వచ్చితిని. నా మాట నిలుపవలెను"

బాబాయి ఎంతగా చెప్పిననూ నా తలలోని విద్యుత్తు బుడ్డీ వెలగలేదు. ముఖములోనికి కాంతి రాలేదు.

> **గమనిక:** ఇందు ఆంగ్ల పదముల కల్తీ యిసుమంతయును లేదు. అంతయును తెలుగే. 50 సం.ల క్రితం నాటి సరళ గ్రాంథికమే. కావున పాఠకుల మెదడులో కలుగు సంకల్ప వికల్ప ములకు రాగ వైరాగ్యములకు రచయిత బాధ్యత లేదు.

"ఇంకనూ సందేహమా?" బాబాయి పృచ్ఛించెను.

ఈలోగా నా గృహిణి – ఒక దినుసు గింజల పొడిలో పాలు, చక్కెర కలిపి రెండు పింగాణి గిన్నెలలో తెచ్చినది. చేదుగానూ మధురముగానూ యున్న ఆ కషాయమును ఆయన గుటకలు వేయుచుండగా – "ఈ మధ్య సంతకములు కొంపలు ముంచి, ఉరి తాడు వోలె కంఠము చుట్టుచూ బిగుసుకుంటున్నవి మామగారూ! అందుకని ఆయన సందేహించుచుంటిరి" వివరించినది నా గృహిణి.

"కొంపలు మునుగుటేమి? ఉరితాడు బిగియుటేమి?" బాబాయి దీర్ఘము తీసెను.

గృహిణి పద్మాసనము వేసుకొని వివరించుటకు పూనుకొనెను. "అబ్దుల్ పకీర్ జైనుల్ బిదిల్ ఎవరో తెలియునా మీకు?" అని మొదట అడిగినది.

ఆయన ముఖమున అయోమయము తాండవించినది.

"పోనిండు. కొణిదెల శివశంకర్ వర ప్రసాద్ తెలియునా?'

"మార్జాలము గురించి తెలియని వానిని బిడాలము గురించి అడిగినట్లున్నది" బాబాయి అనియెను.

గృహిణి నవ్వుకొని "ఒక చిరున్యాయాధికారిని అతనికత్యంత ఆత్మీయుడైన ఒక న్యాయ



వాది యొకనాడు కలిసి – ఢిల్లీకి చెందిన వ్యాపారి అబ్దుల్ పకీర్ జైనుల్ బిదిల్ తన కక్షిదారుని ప్రతి విషయమునందును అడ్డుపడుచున్నాడు. అతనిని న్యాయస్థానముల చుట్టును తిప్పి తిప్పి పరువు తీసి బుద్ధి చెప్పవలసియున్నది. అతనిని బంధించుటకు ఆజ్ఞాపత్రము మీద సంతగించుడు – అని కోరెను. మరియు ఒక మూటను ఆయన జేబునందుంచెను. మూట ముట్టినది కదా, మనవాడే కదా, ఆత్మీయుడు కదా అని ఆలోచించి ఆ చిరున్యాయాధికారి ఆజ్ఞాపత్రమున సంతగించె. అంతే మర్నాడుదయమే వార్తాపత్రికలందును, దృశ్యశ్రవణపేటికలందునూ పెద్ద విస్ఫోటనము సంభవించె. రాష్ట్రపతిని బంధించమని ఆజ్ఞాపించిన చిరున్యాయాధికారి అనుచూ పత్రికలూ, దృశ్యశ్రవణపేటికలూ కాకులై కూసినవి" వివరించెను.

బాబాయి గుడ్లు మిటకరించెను.

"మన రాష్ట్రపతి పూర్తిపేరు అబ్దుల్ పకీర్ జైనుల్ బిదిల్ అబ్దుల్ కలాం అని ఆ చిరున్యాయాధికారికి తెలియదు. ఆజ్ఞాపత్రము మీద ఆయన పేరున్నది గానీ హోదా తెలియజేయలేదు. 'చిరునామా యున్నది గాని యచ్చట రాష్ట్రపతి నివాసముండునని ఆయనకు తెలియదు! మరుగుచున్న తారులో పడిన ఈగ చందము అయినది ఆయన పరిస్థితి. ఉద్యోగము ఊడి ముద్దాయి అయి బోనులో నిలబడవలసి వచ్చె." అని నేను వివరించితిని.

"సంతకము కొంపలు ముంచుట, ఉరితాడు వోలె బిగియుట అనగానిదే" గృహిణి నవ్వినది. బాబాయి నవ్వలేదు. "ఎవరా శివ శంకర వరప్రసాదుడు? ఏమా కథ?" అని అడిగెను.

"నేడు చలనచిత్ర రంగమున అత్యున్నత స్థానమున గల నటుడు చిరంజీవి! ఆయన పేరే కొణిదెల శివశంకర వరప్రసాద్. ఆయన కడుంగడు బీదవాడు. మహబూబ్‌నగర నివాసి– అనుచూ ఒక ఆత్మీయుడు సంబంధిత అధికారి చేత ఆయనకు – ప్రభుత్వ చౌక ధరల విక్రయశాలయందు చౌకగా బియ్యము, చక్కెర, భూగర్భతైలము కొనుగోలు చేయుటకు వీలుగా తెల్ల అనుమతి పత్రముపై సంతకము చేయించెను. అది యొక రగడగా మారినది." గృహిణి చెప్పెను.

"అయిన ఏమందువురా? సంతగించవా, ఏమి?" బాబాయి చిరాకు పడెను.

"పూర్తి వివరములు తెలియకున్న సంతగించుట ప్రమాదము" అంటిని.

"సంతకము పెట్టించుకొని వచ్చెదనని ఆ కుర్రవానికి మాట యిచ్చితిని. ఇప్పుడు రిక్త హస్తములతో పల్లెకు వెళ్ళిన నా పరువు మురుగుకాలువలో మునుగును. సంతగించుము, బాబూ! దీని వల్ల నీకే సమస్య ఉత్పన్నమయిననూ దోషము నామీద వేసుకుందును" బాబాయి బ్రతిమిలాడెను.

డెబ్బది ప్రామాణిక పాషాణముల నా భారమును ఆ బొజ్జగణపయ్యపై వైచి, భవిష్యత్తులో ఏదైనా సమస్య అంకురించిన నీదే. బాధ్యత అని భగవద్గీతను బోధించిన ఆ శ్రీకృష్ణపరమాత్మను హెచ్చరించి తెగించి సంతకము పెట్టివేసితిని.

## సింగిల్ పేజీ కథలకు ఆహ్వానం

'ప్రియదత్త' సకుటుంబ సచిత్ర వారపత్రికలో సింగిల్ పేజీ కథలు ప్రచురణార్థం రచయిత(త్రు)లకు ఆహ్వానం పలుకుతున్నాం. సింగిల్ పేజీ కథలు పంపేవారు ఈ క్రింది సూచనలు గమనింప కోరతాము.

★ కథ అర తావు సైజులో 3 పేజీలు మించరాదు.

★ పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి.

★ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

★ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

★ కథలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. – ఎడిటర్

తరువాత వారము దినములు పీడకలలతో బాధపడి ఐదుపాషాణముల భారము కోల్పోయితిని. నెలరోజులు గడచిననూ నా సంతకము వల్ల సమస్య బయటపడలేదు. హమ్మయ్య అని గుండె నిండా స్వేచ్ఛావాయువులు పీల్చితిని.

ఐవేళ్ళ క్రితము తపాలా కార్యాలయమునందు నేనుంచిన పాతికవేల రూప్యములు నేడు పక్వమునకు వచ్చి నలుబది వేలు అయినది. దానిని తెచ్చుకొనుటకు కార్యాలయమున కరిగితిని. అచ్చట తపాలా అధికారి మారిపోయినాడు. మీరెవరో నేనెరుగను. సాక్షి సంతకము కావలెను అనియెను.

చచ్చినదిరా బర్రె! అనుకొంటిని. తెలిసినవారెవరైనా కనిపింతురేమోనని చుట్టును పరికించితిని. మా యింటికి ఉత్తరములు తెచ్చు తపాల మానవుడు కనిపించినాడు. బ్రతికినదిరా బర్రె! అనుకొని అధికారికి చెప్పగా ఆయన "మా సిబ్బంది సంతకము చేయ వీలులేదు – అని చెప్పుటకు కడుంగడు చింతించుచుంటిని" అని నుడివెను.

అప్పుడు చుట్టునూ పరికించి – మీరు సంతగించెదరా, మీరు సంతగించెదరా – అని ఎందరినో అడిగితిని. నేనొక ఉగ్రవాదిగానో, మోసగాడిగానో కలిపించితిని కాబోలు ఎవరునూ సంతగించనిచ్చగించలేదు. నా హృదయము ద్రవ్యాలయ్యేను. "నేనేమి సేతురా లింగా!" అని బాధపడుచూ నుండగా ఒక యువకుడరుదెంచి తపాల అధికారితో నేదో ముచ్చటించి నా పత్రముపై బరబరా సాకి వ్రాలు చేసి నా వైపు తిరిగి కన్నుకొట్టి వంకరగా నవ్వినాడు.

"నాయనా, నీకు నామీదెంత నమ్మకము! నావల్లనూ, నన్ను నమ్మి నీవు చేసిన సంతకము వల్లనూ నీకేదైనా కీడు సంభవించునని భయములేదా?" అని అడిగితిని.

"కీడా! పాడా! నాది దొంగపేరు. దొంగ చిరునామా! నన్నెట్లు పట్టుకొందురు?" అని నవ్వి "ప్రజలు దొంగనే నమ్ముదురు. దొంగకే పట్టము కట్టెదరు! దొంగపత్రములకే విలువనిత్తురు. మీరెంత గౌరవనీయులైననూ తపాల అధికారి మిమ్ములను నమ్మక నన్ను నమ్మినాడు!" అనుచు వెళ్ళిపోయినాడు. ఔరా కాల మహిమ!

డబ్బు తీసుకొని నేనింటికి వెడలగా – నా కొరకు రక్షక భటులు వచ్చినారు. వెంటనే రక్షక భటాలయమునకు రమ్మనినారు – అని గృహిణి చెప్పినది.

నా గుండె ఝల్లుమనెను. మనసు కీడు శంకించినది. ఆంజనేయ దండకము లోలోనే జపించితిని. మా ఊరి రక్షక భటాధికారి నాకు

మిత్రుడు. అతని తనయుడు మా కళాశాల నందు నా శిష్యుడే - అని తలచుకొని ధైర్యము తెచ్చుకొంటిని.

రక్షక భటాలయమునకు వెళ్ళగా నచట రాజధాని నుంచి వచ్చిన రక్షక భటాధికారితో బాటు మా ఊరి అధికారి కూడా ఉండెను.

"మీకు వీర వెంకట సత్యనారాయణమూర్తి తెలియునా?" అని రాజధాని అధికారి అడిగెను.

"మా ప్రాంతమందు ఆయన తెలియనిది ఎవరికి! అందరికీ ఆయన గూర్చి తెలియును. ఆయనకూ అందరి గురించీ తెలియును" అంటిని. ఆ అధికారి ముఖమున మొదట ఆశ్చర్యము తరువాత చిరాకు కానవయ్యెను. "ఏమిటి మీరనేది!" అని ఎగిరినాడు.

"అన్నవరములో కొలువున్న దైవము శ్రీ వీరవెంకట సత్యనారాయణ మూర్తి గురించి కాదా మీరు అడిగినది?" అంటిని. ఆయన ముఖము మాడిన ఇత్తడి సిబ్బి అయినది!

అంతలో మా ఊరి అధికారి అందుకొని మందస్మిత వదనార విందముతో ఇట్లనెను "కాదు ఉపన్యాసకా, కాదు! ఆయన అడుగుతున్నది - మీరు నెలరోజుల క్రితము ఒకనికి చాలా మంచి అబ్బాయి అని ధ్రువ పత్రము యిచ్చినారు కదా అతని గురించి."

అప్పుడు జ్ఞాపకము వచ్చినది. ఆ కుర్రవాని పేరు అదియే. "అయిన సమస్య ఏమి?" అడిగితిని. రాజధాని రక్షకభటులు ఎర్ర సత్యం అను ఉగ్రవాది కొరకు గాలించుచున్నారు. ఈ కుర్రవాని పేరులో సత్యం ఉన్నది కదా, అతడు, ఇతడూ ఒకరేనా అని వారి అనుమానం - మా ఊరి అధికారి వివరించెను.

"అయినచో మీరు మొదట అనుమానించ వలసినది ఆ అన్నవరం సత్యదేవునే! ఆయన పేరులోనూ సత్యం ఉన్నది కదా!" అంటిని. అందుకు మా అధికారి నవ్వినాడు గాని రాజధాని వాడు కొరకొరా చూసినాడు. మా అధికారి నా పక్షమున వాదించి అతని కొరకొర తగ్గించినాడు.

ఏ పరిస్థితిలో నేను సంతకం చేసితినో వివరించితిని.

రాజధాని అధికారి మా బాబాయి చిరు నామా తీసుకొని వెడలినాడు.

మరునాడుదయమే మా బాబాయితో బాటు రాజధాని అధికారి మా యింటి కొచ్చినాడు.

మా బాబాయి పరిస్థితి చూడగా నా కడుపు దేవినది. ఆయన బట్టతల మీద ఘనీభవించిన రక్తపు గీతలు రంగవల్లిక వోలె శోభిల్లు చుండెను. కనులు ఎర్రకలువలాయెను. దంత ములు ఎగుదు దిగుడాయెను. ముక్కుమీద బిళ్ళజోడు నిలవదాయెను. ఏలననగా ముక్కు అంతగా వాచిపోయినది! వీర వెంకట సత్యనారాయణమూర్తి ఆచూకీ తీయుటకు ఆ అధికారి బాబాయికి బాగుగా తలంటినాడు కాబోలు!

"మీరుభయులూ తోడు దొంగలు వోలె నా కగుపడుచున్నారు. ఉద్దేశ్యపూర్వకముగా ఇద్ద రునూ ఆ కుర్రవాని జాడ మరుగున పెట్టు చున్నారు. మిమ్ములను బంధించి రాజధానికి ఈడ్చుకొనిపోయెదను" అధికారి రంకెలేసి నాడు.

మాడు అప్పడము వోలె బాబాయి ముఖము కాంతి హీనమయ్యెను. నా ముఖ మెట్లు మాడినదో నాకు అగుపడలేదు!


అంతట అధికారి జేబులోని వితంతు దూరవాణి పరికరము కీకీ అని అరిచినది. అతడు దానిని బయటకు తీసి మీటనొక్కి చెవి వద్ద పెట్టుకొని వినినాడు.

మన రక్షక భటుల ఎదురు కాల్పులలో ఎర్ర సత్యం మరణించినాడు. మీరింక అతని కోసం గాలింపు మాని వెనుదిరిగి రాజధానికి రండు - అని సందేశము.

అతడా చిరుపరికరము మీట నొక్కి జేబులో నిడుకొని నవ్వినాడు. నవ్వి - "నాకు తెలియును మీకు సత్యం ఆచూకీ తెలియదని! మీరు అమాయకులని నా అంతరాత్మ ఘోషించుచునేయున్నది" అనుచూ నా చెయ్యి పట్టుకొని ఊపి కరచాలనము చేసినాడు. తరు వాత బాబాయి చెయ్యి అందుకుని కరచాల నము చేయగా ఆయన బాధతో కుయ్యోమొర్రో అనినాడు. తరువాత రాజధాని భటాధికారి పాదరక్షలు టకటకలాడించుకొనుచూ బయ టకు పోయినాడు.

ఆ సత్య దేవుని కృపవలన మేము రక్షించ బడిననూ ఆనాటినుంచి ఈనాటి వరకున్నూ ఎవరైననూ పత్రములు తెచ్చి సంతగించుడని అడిగినచో - అమ్మో, సంతకమా! అని నా గుండెలు బితుకు బితుకు మనుచునే యున్నవి.

ప్రభుత్వమువారు మాకెన్నో కోతలు పెట్టినారు. సంతగించు అధికారమునకు కూడా కోతపెట్టి ఉపసంహరించినచో - నీ కొండకు వచ్చి తలనీలములు సమర్పించు కొందునని ఆ ఏడుకొండలవానికి, నీవ్రతము చేసి ప్రసాదము కళ్ళకద్దుకొని ఆరగించెదనని ఈ సత్యదేవునకూ దినదినమూ మొక్కుచునే యుంటిని. ❋



## డబ్బు దగ్గర ఎవరైనా ఒకటే

'డబ్బు చేతికి రాకపోతే ఎవరైనా ఒక్కటే!'నంటూ చేతల్లో నిరూపించింది కరీనాకపూర్. బోనీకపూర్ చిత్రం 'బేవఫా'లో నటిస్తున్న కరీనాకి మొత్తం డబ్బు అందకపోవడంతో సరిగ్గా డేట్స్ ఇవ్వకుండా, సరైన సమయానికి షూటింగ్‌కి రాకుండా నానా తిప్పలు పెడుతోందట. బోనీ తన కుటుంబీకుడైనా సరిగ్గా డబ్బు అందనందువల్లే కరీనా ఇలా చేస్తుందన్నది చిత్ర యూనిట్ అభిప్రాయం! ఇదేమన్నా బావుందా కరీనా!